క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి



నర్సంపేట రూరల్: ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్ని నిర్వహించాలని స్థానిక ఏసీపీ రవీందర్‌రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి అధ్యక్షతన వివిధ మత పెద్దలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. మండపాలకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని, కమిటీలన్నీ పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం

పర్వతగిరి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థుల తాతలు, అమ్మమ్మలు, నానమ్మలను ఆహ్వానించి విద్యార్థుల ప్రతిభ చాటేలా నృత్య ప్రదర్శనలు చేపట్టారు. వృద్ధులు వారి జీవిత అనుభవాలు, ఆలోచనలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతిలో పెద్దల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న, లెక్చరర్ ప్రవళిక, లైబ్రేరియన్ వీణ, తదితరులు పాల్గొన్నారు.

108 వాహన తనిఖీ



వర్ధన్నపేట : పట్టణంలోని 108 అంబులెన్స్‌ను జిల్లా ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం) నజీరుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో మెడిసిన్, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పరికరాల పని తీరును రెగ్యులర్‌గా పరీక్షించాలని సిబ్బందికి సూచించారు. ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు సత్వరమే స్పందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఎంఈ శ్రీనివాస్, ఈఎంటీ నాగరాజు, పైలట్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ పండుగ

నర్సంపేట : పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా తీజ్ పండుగ నిర్వహించారు. డీజే సౌండ్స్ నడుమ విద్యార్థులు నృత్యం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక సీఐ రఘుపతిరెడ్డి, అమ్మ ఆస్పత్రి వైద్యురాలు హిమబిందు పాల్గొని మాట్లాడారు. తీజ్ పండుగ ప్రాముఖ్యతను కళ్లకు కట్టేలా పండుగ నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కొయ్యడి సనత్‌కుమార్, ప్రిన్సిపాల్ కొయ్యడి శిరీష, డైరెక్టర్ కొయ్యడి సరళ, వైస్ ప్రిన్సిపాల్ అజ్మీరా సూరయ్య, ఏఓ ప్రవీణ్, లెక్చరర్లు పాలడుగుల సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం'

గీసుకొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు ఆకాంక్షించారు. మండలంలోని వంచనగిరి, బొడ్డుచింతలపల్లి, శాయంపేట హవేలి గ్రామాల్లో పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి నాయకులు, కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. సమావేశంలో పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ముంత రాజయ్య, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, పూండ్రు జయపాల్‌రెడ్డి, నాయకులు కంబాల కోటి, గుర్రం రఘు, కొల్లూరి రవీందర్, శ్రీకాంత్, లెనిన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

నర్సంపేట : పట్టణంలోని సర్వాపురం 4వ వార్డు పరిధిలోని పాకాల రోడ్డులోని గుంతలను శివాజీ ఛత్రపతి మహారాజ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం పూడ్చివేశారు. సదరు రోడ్డు గుంతలమయమై వాహనదారులు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన అసోసియేషన్ బాధ్యులు స్పందించారు. గుంతల్లో మట్టి పోసి చదును చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కందికొండ శ్రీనివాస్, ఆలకుంట వినయ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

వర్ధన్నపేట : మండలంలోని బండౌతాపురం శివారు నుంచి కొనారెడ్డి చెరువు వరకు, అంబేడ్కర్ నగర్ నుంచి ఐనవోలు మండలంలోని నందనం వరకు దెబ్బతిన్న రోడ్లకు రెడ్డిపాలెంకు చెందిన గాదె శౌరెడ్డి గురువారం సొంత డబ్బుతో మరమ్మతు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయం కావడంతో మరమ్మతు చేయించారు.

దశలవారీగా 'ఇందిరమ్మ' బిల్లుల చెల్లింపు

● పలువురిలో కొరవడిన అవగాహన..!

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తోంది. ఈ విషయమై లబ్ధిదారుల్లో అవగాహన కొరవడినట్లు కనపడుతోంది. మండలంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిబంధనలు వివరిస్తున్నారు. అయినా పలువురు లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుపై అవగాహన లేదని తెలుస్తోంది. లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ డబ్బును నాలుగు విడతలుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. లబ్ధిదారులు ఇల్లు నిర్మించే స్థలంలో ముగ్గు పోయగానే సంబంధిత అధికారులు కొలతలు తీసి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిన ఇందిరమ్మ ఇంటి యాప్‌లో ఫొటో నమోదు చేసి జియో ట్యాగింగ్ చేస్తారు. అనంతరం విడతల వారీగా నిధులు మంజూరవుతాయి.

మొదటి విడత

ఇంటి బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి కాగానే మున్సిపల్ వార్డు ఆఫీసర్/గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రత్యక్షంగా పరిశీలించి ఫొటో తీసుకుంటారు. దాన్ని సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తే మండల ఏఈకి చేరుతుంది. అనంతరం ఆయన నుంచి డీఈకి లాగిన్ అవుతుంది. డీఈ నుంచి పీడీకి చేరిన అనంతరం ఆయన కలెక్టర్ లాగిన్‌కు పంపుతారు. కలెక్టర్ వివరాలన్నిటినీ పరిశీలించి మొదటి విడతగా రూ.లక్ష లబ్ధిదారు ఖాతాలో జమ చేస్తారు.



నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

రెండో విడత

ఇంటి నిర్మాణం స్లాబు లెవల్ వరకు గోడలు నిర్మించిన తర్వాత అధికారులు ఫొటో క్యాప్చర్ చేసిన తర్వాత మొదటి విడత తరహాలోనే ప్రక్రియ జరుగుతుంది. సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో మరో రూ.లక్ష జమ అవుతాయి.

మూడో విడత

మూడో విడతలో ప్రభుత్వం రూ.2 లక్షలు అందిస్తుంది. ఇందుకోసం ఇంటిపై కప్పు సిమెంట్, ఐరన్, కంకరతో స్లాబ్ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. అధికారులు ఇంటిని మళ్లీ ప్రత్యక్షంగా పరిశీలించి ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. తదనంతరం సంబంధిత స్థాయిల్లో అధికారుల పరిశీలన అనంతరం లబ్ధిదారు ఖాతాలో రూ.2 లక్షల జమ అవుతాయి.

నాల్గో, చివరి విడత

చివరి, నాల్గో విడత కింద రూ.లక్ష మంజూరు చేసేలా ప్రభుత్వం నిబంధనల్లో నిర్దేశించింది. ఈ నిధులు మంజూరు కావాలంటే ఇంటికి ప్లాస్టరింగ్, మరుగుదొడ్డి నిర్మాణం, రంగులు వేసి ఉండాలి. అధికారులు అన్ని పనులను ప్రత్యక్షంగా పరిశీలించి ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేస్తారు. తదనంతరమే చివరి విడత రూ.లక్ష లబ్ధిదారు బ్యాంకు ఖాతాలోకి చేరుతాయి.

సంపూర్ణ అక్షరాస్యతే 'ఉల్లాస్' ధ్యేయం



నల్లబెల్లి : మాట్లాడుతున్న ఎంపీడీఓ రవి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

● ఎంపీడీఓ రవి, ఎంఈఓలు సరళ, రాము

సాక్షి నెట్‌వర్క్ : సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా ప్రభుత్వం, విద్యాశాఖ ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని నల్లబెల్లి ఎంపీడీఓ రవి, ఎంఈఓలు బైరి సరళ, గాయపు లింగారెడ్డి, రాము, మామునూరు శ్రీధర్, శ్రీదేవి, వెంకటేశ్వర్లు తెలిపారు. చెన్నారావుపేట, నల్లబెల్లి, పర్వతగిరి, సంగెం, వర్ధన్నపేట, ఖానా పురం, దుగ్గొండి మండలాల్లోని స్కూళ్లలో ఉపాధ్యాయులకు, స్వయం సహాయక సంఘాల వీఓఏలకు తలపెట్టిన శిక్షణ కార్యక్రమాలను వారు గురువారం ప్రారంభించి మాట్లాడారు. నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చే దిశగా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం వంటి కనీస సామర్థ్యాలతో కూడిన విద్య అందించాల్సి ఉందని వివరించారు. కార్యక్రమాల్లో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్లు వరలక్ష్మి, రేవతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, ఏపీఎంలు సుధాకర్, తిలక్‌కుమార్, ఆదరసంది రాజీరు, శేషు, నర్సయ్య, రాజ్‌కుమార్, రమణాచారి, గుడికందుల సురేశ్, శివకుమార్, రమాదేవి, రమేశ్, ప్రధానోపాధ్యాయులు అంబి వసంత, పాపమ్మ, రవీందర్‌రెడ్డి, భిక్షపతి, రమేశ్‌బాబు, రంగా అనిల్‌కుమార్, రామస్వామి, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎం రేవంత్‌కు పోస్టుకార్డులు



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన పోస్టుకార్డులు చూపుతున్న ఎల్గూర్ రంగంపేట గ్రామస్తులు

● ఎల్గూర్ రంగంపేట గ్రామస్తుల వేడుకోలు

సంగెం : గ్రామంలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి సంగెం మండలం ఎల్గూర్ రంగంపేట గ్రామస్తులు గురువారం పోస్టుకార్డులు రాశారు. గ్రామానికి రాకపోకల కోసం నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షపు, ఊట నీరు చేరి వర్షాకాలంలో తరచూ రాకపోకలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఈ క్రమంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎల్గూర్ రంగంపేటతోపాటుగా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అంతర్గత రహదారి పూర్తిగా శిథిలమైందని, అద్దె భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం నడుస్తున్నదని తెలిపారు. పక్కాభవనం నిర్మించాలన్నారు. గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని పోస్టుకార్డుల్లో పేర్కొన్నారు.

యూరియా కొరతతో అరిగోస



పర్వతగిరి : యూరియా కొరతతో అరిగోస పడుతున్నామని రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎదుట వాపోయారు. పలు కార్యక్రమాలకు హాజరై వెళ్తున్న ఆయన్ను మండల కేంద్రంలో రైతులు గురువారం కలిసి మాట్లాడారు. ఉదయం నుంచి తిండి తిప్పలు మానుకుని ఎరువుల కోసం ఎదురు చూస్తున్నామని వాపోయారు. దీంతో దయాకర్‌రావు స్పందించి కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. రైతులకు వెంటనే ఎరువులను అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్, నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాడుగుల రాజు, భానోతు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో అసమర్థత



క్యూలైన్‌లో నిల్చున్న రైతులతో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రైతులకు సరిపడా యూరియా అందించలేని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. చెన్నారావుపేటలోని సొసైటీ గోదాం వద్ద గురువారం యూరియా కోసం క్యూ లైన్‌లో నిలబడ్డ రైతులతో ఆయన మాట్లాడారు. తొలుత యూరియా బస్తాల కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఎరువుల బస్తాలు తీసుకోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ పత్తి నాయక్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు అమ్మ రాజేశ్, కొండవీటి ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పేరుతో బెదిరింపులు



లారీ అసోసియేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సభ్యులు

● అసోసియేషన్‌లో ఓ వర్గం నిరసన

గీసుకొండ: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ఓ వర్గం నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. ప్రగతి పారిశ్రామిక ప్రాంతం హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్ పక్కనే ఉన్న అసోసియేషన్ కార్యాయలం వద్ద నాయకులు ఫిరోజ్ అలీ, షేక్ అజ్మల్‌తోపాటు లారీ ఓనర్లు, కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గతంలో సంఘం ఎన్నికల్లో తమతో పోటీ చేసి ఓడిపోయిన షకీల్ అహ్మద్, వేముల శ్రీకాంత్, బొరిశెట్టి నారాయణ, నాయిబ్, తదితరులు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. తాము సంఘానికి సంబంధించిన నిధులు దుర్వినియోగం చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రాజు పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారు అక్రమాలకు పాల్పడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సరైన సమయంలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించి లారీ యజమానులు, కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు.

నేడు మారెమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేటలో నిర్మించిన మారెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నేడు (శుక్రవారం) జరగనుంది. మోతె వంశస్తులు మారెమ్మ విగ్రహాన్ని ఆలయ దాతలు మోతె అరుణాదేవి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఊరేగించారు. అమ్మ వారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. వందేళ్ల క్రితం మోతె వంశస్తులు నిర్మింపజేసిన ఆలయాన్ని పునర్నిర్మించడం చరిత్రాత్మకమని చెప్పారు. పూజారి బందెల రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని తెలిపారు. భక్తులు, ప్రజలు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు మోతె సంపత్‌రెడ్డి, మోతె నరేందర్‌రెడ్డి, మోతె రాజశేఖర్‌రెడ్డి, మోతె వేణుప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనా రాహిత్యంతో పెద్ది వ్యాఖ్యలు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్

నర్సంపేట : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అవగాహనారాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ అన్నారు. చెన్నారావుపేటలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమీక్షించడం లేదంటూ పెద్ది చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్రం నుంచి ఏప్రిల్‌లో రాష్ట్రానికి రావాల్సినంత కంటే తక్కువ యూరియా అందిందని తెలిపారు. అవగాహన లేకుండానే పెద్ది రైతులను ఉసిగొల్పి రోడ్డుపై బైఠాయించి అధికారుల కాళ్లు మొక్కించి సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలోని అన్ని 29రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వమే యూరియా సరఫరా చేస్తుందని, బీజేపీ పాలిత రాష్ట్రాలకు సరిపడా అందిస్తూనే తెలంగాణకు తక్కువగా పంపిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష వీడి సరిపడా యూరియా అందించి కొరత నివారించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే మద చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు నమ్మబోరని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు భూక్య గోపాల్, ఆవుల రాములు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన చిక్కొండ దూడేలు, గజ్జెల సరోజన, ఇటికాల గౌతమ్, కామిండ్ల రాజ్‌కుమార్, కాసు యాకమ్మలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు సహకారంతో పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నాగరాజు పేదలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారి సతీశ్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్, నాయకులు తీగల సునీత, కుమారస్వామి, నాయకులు రాజు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎంపిక పోటీలు



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ ఆధ్వర్యంలో గురువారం సీనియర్ డివిజన్ ఎన్‌సీసీ ఎంపిక పోటీలు నిర్వహించారు. 27 ఖాళీల కోసం 63 మంది విద్యార్థులు పోటీ పడగా ఎన్‌సీసీ అధికారులు మహ్మద్ ఆజమ్ అలీ, దినకర్ ముండే, కిరణ్ ఎత్తు, బరువు, రన్నింగ్, హిప్ అప్, రోప్ టైర్, తదితర పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూశ, అధ్యాపకులు సుజాత, రాములు, యాదగిరి, ఏడుకొండలు, విజయ్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో హాస్టళ్లు నిర్వీర్యం

● ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వ తీరుతో హాస్టళ్లు నిర్వీర్యమవుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేశ్ ధ్వజమెత్తారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ హాస్టల్‌ను గణేశ్, నాయకులు గురువారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పెంపు, ఇతర అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నామమాత్రంగా పెంచి మోసపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచలేదన్నారు. హాస్టళ్లలో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో హాస్టళ్ల అపరిశుభ్ర వాతావరణంలో ఉండడంతో విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, హాస్టళ్లలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలు పెంచాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జాన్సన్, శివకుమార్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం

నర్సంపేట రూరల్ : జీవితంలో విద్యార్థి దశ కీలకమని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు రాణించి తల్లిదండ్రుల, అధ్యాపకుల, కళాశాల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ వనజ, కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిహరన్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ పర్వేజ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టఫ్ మండల కమిటీ ఎన్నిక

సంగెం : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టఫ్) మండల కమిటీని పెండ్లి మహిపాల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫోరం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా కొడగాని శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా మహబూబ్‌పాషా, రమేశ్, పోశాల సతీశ్, ప్రధాన కార్యదర్శిగా మాదినేని కోటి, సహాయ కార్యదర్శిగా గుండేటి కోర్నేలు, పోశాల ప్రభాకర్, బోగి రవి, కోశాధికారిగా మామిడాల బాబు, శంశొద్దీన్ ఎంపికైనట్లు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం

దుగ్గొండి : విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ప్రత్యూష తెలిపారు. మండలంలోని గిర్నిబావిలోని సబ్‌స్టేషన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గణనాథ మండళ్ల నిర్వాహకులు, వినాయక ఉత్సవ విగ్రహాల తయారీదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. విగ్రహాలను మండపాలకు తరలించే క్రమంలో రహదారులపై ఉండే విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలు 10 అడుగుల ఎత్తు మించితే తప్పనిసరిగా విద్యుత్ శాఖ అధికారులకు ముందస్తుగా సమాచారం అందించాలని చెప్పారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని స్పష్టం చేశారు.

కేజీబీవీలో ఇంటరాక్ట్ క్లబ్

పర్వతగిరి : స్థానిక కేజీబీవీలో రోటరీ క్లబ్ వరంగల్ ప్రతినిధులు ఇంటరాక్ట్ క్లబ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లింగారెడ్డి, క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్, సెక్రటరీ ఎల్లరాజు, యూత్ సర్వీస్ డైరెక్టర్ సురేశ్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. క్లబ్‌ను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వరంగల్ బుకీస్ ఫౌండర్ శ్రీ నయని మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కొంకపాక కాంప్లెక్స్ హెచ్ఎం భిక్షపతి, సీఆర్ఓ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల అందజేత

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1991–92 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకుని ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న చందా బుచ్చయ్య తన తండ్రి వీరవెంకయ్య జ్ఞాపకంగా తను చదువుకున్న ఆ స్కూల్ విద్యార్థులకు సుమారు రూ.10 వేల విలువైన డైరీలను తన తల్లి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ గాయపు లింగారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు డైరీ రాయడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. హెచ్ఎం పాక రమేశ్ బాబు మాట్లాడుతూ బుచ్చయ్య ఉన్నతిని, తోడ్పాటును అభినందించారు.



డైరీలు అందజేస్తున్న రాజ్యలక్ష్మి, తదితరులు

అంతర్జాతీయ సదస్సుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



లక్ష్మణ్

నెక్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు వంగర లక్ష్మణ్ మలేషియా దేశంలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారని ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రంగారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి (శుక్రవారం) నుంచి 25వ తేదీ వరకు ఆ దేశంలోని పెనాంగ్ నగరంలోని పెయిన్ విశ్వవిద్యాలయంలో 11వ అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని తెలిపారు. ది ఏషియన్ అసోసియేషన్ ఫర్ లాంగ్వేజ్ అసెస్మెంట్ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు రంగారావు తెలిపారు. లక్ష్మణ్ 'ఏ క్వాలిటీ స్టడీ ఆన్ ఇంగ్లిష్ ఆజ్ లాంగ్వేజ్ బిలీవ్స్ అండ్ ది తెలంగాణ కాంటెక్స్ట్' అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ముంబై నుంచి ఎడ్యుకేషన్‌లో లక్ష్మణ్ పీహెచ్‌డీ చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కు హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.